చెరగని అక్షరాలు

శ్రీ ఇసుకపల్లి దక్షిణామూర్తి

వాన తుంపరలు కన్నీటి చుక్కల్లా నేలమీదకు బరువుగా రాలుతున్నాయి. అమావాస్య చందమామ భూమికి అడుగునే వుండిపోయింది. ఆకాశమంతా ఆవరించిన చీకటి తెరలోనుంచి చిల్లులు చేసుకుని స్వర్గం సుషుప్తిలో వున్న భూభాగాన్ని పరికిస్తోంది. వీధిలోని చీకటి, తలుపులు లేని కిటికీగుండా లోపల ప్రవేశించి, గోడమీదవున్న ఆముదం దీపాన్ని భయపెడుతోంది. అప్పుడప్పుడు చెదురువాటుగా వీస్తున్న గాలికి వూగులాడుతున్న దీపశిఖ, ఆ గాలి తెర తగ్గగానే ధైర్యం కూడగట్టుకుని సూటిగా నిలబడి చూస్తోంది—పొగను సూటిగా పైకి వదిలేస్తూ. దాని మీద చలిప్రభావం పడ్డట్లు కనిపించటంలేదు గాని ఎదురుగా కూర్చున్న పార్వతిమాత్రం మోకాళ్లకు తల వానించి గజగజా వణికిపోతోంది. పైనకప్పుకున్న దుప్పటి ఆమెలోంచి వస్తున్న వణుకును ఆపలేక పోతున్నట్లుంది.

“తలుపు తియ్యమ్మా పారూ...” బయటనుంచి తలుపును బాదుతూ లలితమ్మ గట్టిగా అరిచింది.

“మరీ చోద్యంగా వుందే వ్యవహారం.. యింత కంగారయిపోతే ప్రతిదానికీ ఎట్లాగే...మనిషన్న తర్వాత రోగం నొప్పి రాకుండా వుంటుందా...” లలితమ్మ తలుపు కవతలనుంచి పార్వతి నుద్దేశించి సముదాయింపు పూర్వకంగా అంటోంది. పార్వతి తడిసిపోయిన చేతిగుడ్డను మంచంకిందకు తోసేస్తూ “వస్తున్నానమ్మా” అని తలుపు తీసింది. తలుపు తెరుచుకోటంతోటే పార్వతిని చేతుల్లోకి తీసుకుని “వెర్రిపిల్లా అని... ఛీ...” అంది.

“మరీ యిదిగా వుంటేమిటే...మీ మామయ్యకు యింతకంటే పెద్ద సుస్తీ చేసిందిగాని యింత కంగారు ఎవ్వరూ పడలేదమ్మా...తమ్ముడిని అనుకోరాదుగాని యిప్పుడు చూడు మనిషి ఎట్లా వున్నాడో...” పార్వతి కళ్లకు కొంగు అద్ది “కొద్దిగా మెతుకు ఎంగిలి పడమ్మా...మామయ్యేమో విస్తరిముందు కూర్చున్నాడు...నువ్వు రాందే అన్నం తినడుట...పోనీ వాడికోసమైనా రారాదుటే...”

పార్వతి మెల్లిగా లలితమ్మకౌగిలి వదిలి వంటింటి వైపుకు కదిలింది. కాళ్లు కొద్దిగా నీరసించి తడబడుతున్నా తల్లి భుజంమీద చెయ్యివేసి అడుగులు మెల్లిగా వేస్తూ వచ్చింది.

“ఏం పారూ...అట్లా బేజారయిపోతారుటే... ఆ...నాకెంత సుస్తీ చేసిందో నీకేం తెలుసు...మీ అత్తయ్య ఏమైనా మనిషి కదిలిందా...మనిషి అంటే అట్లా వుండాలి...ఏమే సావిత్రీ....’ గోపాలరావు నోటివెంట మాట పూర్తికాగానే పార్వతి చిరునవ్వు నవ్వబోయి సావిత్రిని చూసి వూరుకుంది. సావిత్రి చేతిలో గరిటెకిందపడేసి పార్వతిని చూసి పక్కున నవ్వింది.

‘అన్నానికి కూర్చుంటానుగాని...ఆ ప్రమిదలో చమురుందేమో చూసిరావే అమ్మా!

‘ఏం? చీకట్లో రాములవారికి గదిలో సామానన్నీ కనపడవనా...వుంటే వుంటుంది...పోతే పోతుంది గాని...నాకొంచెం అన్నం పట్టుకు రావే అక్కయ్యా...’

పార్వతి చివాలునలేచి గోపాలరావువంక వకసారి తీవ్రంగా చూచింది. తన గదిలో వెలుతురు లేకపోయినా ఫరవాలేదనే టప్పటికి గుండె జల్లుమంది పార్వతికి.

‘నువ్వు అన్నం సంగతే చూసుకో అమ్మా... నా దీపం సంగతి నేనే చూసుకుంటానులే’ అంటూనే పార్వతి గదివైపు గబగబా నడిచింది.

వీధితలుపు నెవరో బాదినట్లు చప్పుడయింది. గోపాలరావు అన్నం కలుపుకోవటానికి ఉద్యుక్తుడవుతూ.

‘వాకిట్లోకి ఈ వానలో పడివచ్చా రెవరో... చూసి రావే సావిత్రీ’ అన్నాడు. సావిత్రి గడపలోనే నిలబడింది. లలితమ్మ వీధి తలుపు వైపుకు పోవటం చూసి.

‘వస్తున్నానండీ...ఎవరో వక్క క్షణం ఆలస్యం అయితే సరి...తలుపు నట్లా బాదుకుంటారు...ఊ...’ అంటూ సణుగుతూ వెళ్లింది. తలుపు యింకా చప్పుడు అవుతునే వుంది లలితమ్మ గడియతీసి తలుపు తెరిచే వరకూ. బయటి చీకటిలో దీపంలేని సైకిలుమీద

గొడుగు వేసుకుని వచ్చిన వ్యక్తి ఒక కాలును నేల మీద మోపుతూ సైకిలుమీద నే కూర్చుని కనపడ్డాడు. లలితమ్మ చీకటిలో బయటికి పోవటానికి సందేహించింది. బయటి మనిషి గొడుగును మెడతో గట్టిగా పట్టుకుని సైకిలు దిగి.

'అయ్యగా రున్నారా' అన్నాడు. సావిత్రి వంటింటి గుమ్మంలోనుంచే.

'అన్నం తింటున్నారుగా... కాసేపు అరుగు మీద కూర్చోమని చెప్పండి అత్తయ్యా!' అంది. పార్వతి ప్రమిదమాట మరచిపోయి కిటికీలోనుంచి వస్తున్న చలిగాలికి కొద్దిగా కంపిస్తూ.

'ఏమి కావాలో కనుక్కోరాదుటే అమ్మా' అంది.

గోపాలరావు కంచం ముందరనుంచి లేచి వాకిట్లోకి వస్తూ 'ఎవరండీ వాకిట్లో... లోపలకు రండి' అన్నాడు. లలితమ్మవైపుకు తిరిగి 'అక్కయ్యా... అట్లా వాకిలి కడ్డంగా నిలబడకబోతే ఆయన్ని లోపలకు రానీయరాదుటే' అన్నాడు.

'దణ్ణాలండీ.... అయ్యగారికి అర్జెంటు కాగితం యిచ్చేయమంటే' నసిగాడు వాకిట్లో మనిషి అక్కడినుంచే, చలి విచక్షణలేకుండా గోపాలరావునుకూడా గజగజ లాడించింది. వాకిట్లోకి వచ్చి టెలిగ్రాం అందుకుని కాగితంమీద సంతకం పెట్టి "మామూలు రేపొద్దున్న యిస్తాలేరా... మళ్ళీ రా" అన్నాడు. బయటి బంట్రోతు సైకిలుమీద ఎక్కుతూ "పాపిష్టోణ్ణి... నాకు మామూలు ఎందుకులే అయ్యా" అన్నాడు.

పార్వతి పరుగెత్తుకుంటూ వచ్చింది. సావిత్రి చెయ్యి కడుక్కుని కొంగుకు తుడుచుకుంటూ మెల్లగా సావిట్లోకి వచ్చింది.

"ఏరా గోపీ... ఈవాల్టప్పుడు మనింటికి వుత్తరం వచ్చింది..." అంది లలితమ్మ ప్రతి అక్షరాన్ని సాగదీస్తూ.

"మీతో ప్రతీదానికి చావొస్తోందే... ఎందుకు యీ హడావుడి... గుబగుబలూనూ... ఆ..." గుండె దడను మాటలలో దాచుకోలేక తడబడుతూ అన్నాడు, కవరు వక్రప్రక్కన వంకరగా చించేస్తూ.

పార్వతి సావిత్రికి వెనకాలగా నిలబడి రెండు సార్లు "అత్తయ్యా... అత్తయ్యా" అంటూ పిలిచింది. గోపాలం టెలిగ్రాం పూర్తిగా చదవకుండానే "అక్కయ్యా..." అంటూ లలితమ్మ కాళ్ళమీదకు వరిగిపోయాడు. లలితమ్మ గుండె బాదుకుంటూ:

"ఏమయిందిరా గోపీ... నా కొంపకు ఏం యిక్కట్టు వచ్చిందిరా దేవుడా" అంటూ రాగాలు తీయటం మొదలుపెట్టింది. సావిత్రి అతని చేతిలోని ఉత్తరం వక్కసారిగా గుంజి:

"ఏమయిందండి... మాట్లాడరేం" అని టెలిగ్రాం గబగబా నాలుగు ముక్కలూ చదివేసి పార్వతికోసం వెనక్కు తిరిగింది. పార్వతి కళ్ళు ఎర్రగా జ్యోతుల్లాగా వెలిగి పోతున్నాయి. సావిత్రి ఏదో మాట్లాడటానికి పెదవి కదల్చబోయింది. పార్వతి:

'అత్తయ్యా... యిప్పుడే వస్తా ప్రమిదలో నూనె పోసి వక క్షణం ఆగు...' అంటూ గదిలోకి పరుగెత్తబోయి జారిపోయిన చీరె కొంగు కాలికి తగులుకుని గభాలున గది ముందర పోయి పడ్డది. ఆ గాలికి అసలే నూనెలేని దీపం గబుక్కున ఆరిపోయింది. కొడిగట్టిన దీపాన్ని ఆసరా చేసుకుని నివసిస్తున్న పొగ దానిని వదిలి పైకి వెళ్ళిపోయింది.

'అమ్మా దీపం పోయిందే' అంటూ పార్వతి బిగ్గరగా అరిచింది. లలితమ్మ పార్వతిని లేవతీసి వళ్ళోకి తీసుకుని,

'అవునే తల్లీ మన దీపం ఆరిపోయిందే... తల్లీ దేవుడో' అంటూ బిగ్గరగా రోదించటం మొదలుపెట్టింది. పార్వతి తల్లివైపు చూసి విషాదంగా నవ్వుతూ 'నేననుకున్న దేనమ్మా' అంటూ గొణిగింది.

సావిట్లో గచ్చుమీద మూలగా పడుకున్న పార్వతి పగిలిపోయిన గాజు పెంకులవంక చూస్తోంది నిలువుగుడ్లు పెట్టుకుని. ఎడంచేతి పని అయిపోగానే కుడిచేతి గాజులవంక చూస్తూ లలితమ్మ వినునాలో తోచక పార్వతిమీద పడి 'అయ్యో... నేను బ్రతికుండగానే యిటువంటి కష్టం వస్తుందని అనుకోలేదే తల్లీ' అంది. పార్వతి నిర్లిప్తంగా అటువైపు చూస్తూ కుడి చెయ్యి బలవంతంగా లేపి పక్కకు తిరిగి ఎడం చేతి పక్కన పెట్టింది. కంగు కంగు మంటూ గాజులు చిటికిపోతుంటే పార్వతి కంటి వెంట వకొక్క బొట్టుంరాలి చెక్కిళ్ళకిందకు జారకుండానే ఆరిపోతున్నాయి.

"పదిగంటల బండీకి రామాపురం పోదాం అక్కయ్యా... పెట్టెలో నాలుగుబట్టలు సర్దు" గోపాలరావు యింట్లో హడావుడి కొంచెం సర్దుకోగానే మెల్లిగా లలితమ్మతో అన్నాడు. పార్వతి అతనివంక నిర్లక్ష్యంగా చూసి ముఖం లలితమ్మ వళ్ళోకి దాచుకుంది.

"నేను బజారుకుపోయి వచ్చేలోపుగా అన్నీ సర్ది సిద్ధంగా వుండండి..." గోపాలరావు వుత్తరీయం భుజాన వేసుకుని:

"సావిత్రీ...ఆ సంచీ యిటు తీసుకురావే... బజారుకుపోయి పదినిమిషాల్లో వస్తాను" అన్నాడు. సావిత్రి దణ్ణెంమీద వేసిన సంచీవంక చూస్తూ 'అందదన్నట్లు' నిలబడింది. గోపాలరావు సంచీని పైనుండి అందుకుంటూ.

"ఏమక్కయ్యా...వచ్చేపొద్దా...పోయేపొద్దా. తొందరగా లేచి ఆ పనేమిటో చూడరాదూ... రెండు మెతుకులు నోట్లో వేసుకుని మళ్ళీ బయలుదేరాలయ్యే...మనకోసం బండీ ఏమన్నా ఆగుతుంది గనకనా" అన్నాడు. లలితమ్మ కళ్ళనీళ్లు కొంగుకి తుడుచుకుంటూ:

"నీతిండి పాడయిపోను...యిక్కడ వకమూల చచ్చి యేడుస్తుంటే నీ తిండి తాపత్రయం...యిదైపోతుందా...యివ్వాళ పొయ్యిమీద బియ్యంయెక్కడానికి వీల్లేదు."

"అయ్యో నా తల్లీ....ఎంత ఆపదవచ్చిందే..." పార్వతి తల్లిని ఇంకా గట్టిగా కౌగలించుకుని "అమ్మా ...అమ్మా" అంటూ బావురు మంటోంది.

"సావిత్రీ నువ్వన్నా చూడవే...తిండి సంగతి.. వాళ్లనట్లా కాసేపు కదలకుండా వుండనీ..."

"అయ్యో...మరీ వుప్పలాయిగా వుంటేమండీ.. మీ మొండిపట్టు యిటువంటప్పుడు మానకపోతే ఎట్లాగండీ...ఛీ..." అంటు విసుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళింది.

"అంతా కట్టకట్టుకుని ఏడవండి...ఏడిస్తే తీరే దుఃఖమా... నేను గూడా ఆడదానిలా ఏడవలేక వూరుకున్నా గాని...నా దుఃఖంలో వకవంతు—" గోపాలం వుత్తరీయంతో ముఖం గట్టిగా తుడుచుకుని సావిట్లో ఒకమూలకి గిరవాటు వేశాడు.

"మనం ఏం చెయ్యగలం అక్కయ్యా..."లలితమ్మదగ్గరకు పోయి చతికిల బడ్డాడు. లలితమ్మ అతని భుజంమీద చెయ్యివేసి "త...మ్ముడూ" అంటూ ఆవురుమంది.

"మనం ఏం చేస్తాం అక్కయ్యా...నాకూ యింతరోగమూ వచ్చిందా...ఏమయింది...యింత యిక్కట్టు వస్తుందని కలలో కూడా అనుకోలేదు" పార్వతి ... అతని కళ్లల్లోకి సూటిగా చూసింది. ఆమె కనురెప్పలు నల్లగుడ్డును గాలికి వదిలేసి నిశ్చింతగా నిలిచి వున్నాయి. నుదురు అదురుతోంది. పెదవులు అస్పష్టంగా వణుకుతున్నాయి.

"అట్లా చూడకపారూ...నా వంక ... వద్దుపారూ అట్లా నా వంక చూడకు..." గోపాలరావు పార్వతి వంక చూస్తూ రెండు చేతులూ కళ్లకు అడ్డం పెట్టుకున్నాడు. సావిత్రి మెల్లిగా పార్వతి ప్రక్కకు చేరింది.

"పారూ...నావంక చూడమ్మా..." పార్వతి సావిత్రివంక చూడకుండానే తల్లి వళ్లో ముఖం దాచుకుంది.

"సావిత్రీ...కాసిని మంచి నీళ్లు తీసుకురా అమ్మా...గొంతు ఆర్చుకు పోయినట్లుంది పార్వతికి!..

"అట్లాగే అత్తయ్యా..."

"పారూ...ఏడవకమ్మా...మనం ఏం చెయ్యగలం యిప్పుడు" అన్నాడు గోపాలరావు.

పార్వతి తల్లివడిలో నుంచి విడివడి కూర్చుంది గోపాలరావు వంకకు తిరిగి. ఆమె బలవంతాన పెదవులు కదిపి:

"అవును, యిప్పుడు చెయ్యగలిగింది ఏముంది... చెయ్యగలిగిన దంతా అది వరకే చేసేశారు..." అంది ఆగ్రహంగా.

"ఆ..." అంటూ అదిరిపడ్డాడు గోపాలరావు. అతని మెదడులో గతించిన చరిత్రంతా పుటలు తిరగవేస్తూ ప్రత్యక్షమయింది. పార్వతి ముఖంలో రోగిష్ఠి ప్రతిబింబం కనపడుతోంది.

"చెయ్యగలిగిందంతా అదివరికే చేశారు. చిన్నతనంలోనే గొంతుకకు వురిపోశారు ... యిప్పుడు చెయ్యగలిగినదేముంది వురి బిగిసిపోయిన తర్వాత....'

'అదేమిటే పార్వతీ...అదేమిటే కన్న కూతురుకు వురిపోసుకుంటారుటే...అవేం మాటలే...'

'అడుగు మీ తమ్ముణ్ణి అడుగు'—తమ్ముడు అంటూ వ్యంగ్యంగా వచ్చినమాట శూలంలా గుచ్చుకుంది గోపాలం హృదయానికి. పార్వతి వంక అతను చూడటానికి భయపడ్డాడు. అక్కడినుంచి లేచి వంటింటి వైపుకు ముఖం తిప్పి:

'నేనేం చేశాను...' అంటూ గొణిగాడు. పార్వతి హృదయం బ్రద్దలైంది. ముఖం జేవురించింది.

'అంతా నువ్వే చేశావు...నా పచ్చని జీవితంలో నిప్పుల కుంపటి పెట్టావు...ఆయనకా సుస్తి మొదటినుంచీ వుందని మీ రందరికీ తెలియదూ...అతని ఆస్తికి ఆశపడి...ఎదురువచ్చే సొమ్ములకు వ్యసనపడి...అమ్మా ...నా గొంతు కోశారే...' అంటూ బిగ్గరగా అరుస్తూ లలితమ్మ వళ్ళోకి వరిగిపోయింది పార్వతి గోపాలరావు పిచ్చెత్తినవాడిలా అయిపోయాడు. లలితమ్మ అతనివంక తీవ్రంగా చూస్తూ 'ఏంరా...ఆయనకీ

సుస్థీ వున్న సంగతి తెలుసురా నీకు ... మాట మాత్రంగానైనా చెప్పలేదేంరా నాకు' అంది గట్టిగా.

"అదేం లేదక్కయ్యా" మాట తడబడిపోతోంది గోపాలరావుకు. "కొద్దిగా దగ్గువచ్చేదిట చిన్నప్పుడు...జలుబు మనందరికీ వున్నట్లే అతనికీ వుండేదిట...అంతే"

"అంతేనా"—పార్వతి కయ్యిమంటూ లేచింది. "అతనికి రోజూ జ్వరం వచ్చేదిగాదూ...నోటి వెంబడి నెత్తురు పడేదిటగాదూ..యివన్నీ అబద్ధాలా?" సావిత్రి ముఖం తిప్పించుకుంది. లలితమ్మ అందుకుని,

"ఏరా మాట్లాడవేం" గోపాలరావుని గట్టిగా గద్దించి అడిగింది.

"ఎప్పుడన్నా వచ్చేదిట అక్కయ్యా"

"అవన్నీ వప్పుకున్నవాడివి...అతనికి క్షయ వున్నదని చెప్పడానికి దాపరికమెందుకు...నా జీవితాన్ని నీ సౌఖ్యంకోసం నాశనం చెయ్యటానికి సాహసించావుగాని, కావాలంటే నీవు కోరిన పైకం ఎక్కడైనా ముష్టెత్తుకుని యిచ్చేదాన్నిగాదూ నీకు..." పార్వతి ముఖం వివర్ణమైపోయింది. వూరికే రొప్పుతోంది. పిచ్చిదానిలా జుట్టు చేతుల్లోకి తీసుకుని "మీరంతా దొంగలు...నన్ను చంపుతున్నారు...వురి బిగుసుకు పోతోంది...అమ్మా...అమ్మా..." అంటూ అరవటం మొదలు పెట్టింది.

లలితమ్మ కంగారుపడ్డది. ఎన్నడూ నోరెత్తి మాట అనని పార్వతి ఎందుకు అట్లా గొంతుచించుకుని అరుస్తోందో అర్థంగావటంలేదు. దుఃఖంలో ఆవురావురుమని ఏడవటం ఎరుగుందిగాని యిటువంటి వెర్రి కేకలను వింటుంటే పార్వతికేదైనా మతి భ్రమించిందేమోనని భయపడింది.

'ఒరేయి గోపాలం...నా కొంపకేదో ముప్పు వచ్చిందిరా నాయనా...డాక్టరును పిలుచుకురా...రా...ముందర... తొ ం ద ర గా పోయిరారా నాయనా...' లలితమ్మ పార్వతిని కదలకుండా ఒళ్లో పెట్టుకుని అదుముకుంటోంది.

"నాకేం పిచ్చెత్తలేదు...దయ్యం గూడా పట్టలేదు.. నన్ను పిచ్చిదాన్నిచేసి నా జీవితాన్ని నాశనం చేశారు...మల్లెచెట్టు పీకివేసి తుమ్మచెట్టు నాటారు.. యింకా డాక్టరు గూడా ఎందుకు..." పార్వతి ముఖంలో ఎరుపుదనం తగ్గి కొద్దిగా తెల్లబడింది. చిరునవ్వు పొడగూడా కనపడింది. ఒక్కసారిగా విరగబడి నవ్వుతూ 'ఏం మామయ్యా నన్ను పెళ్ళి చేసికోరాదూ...నువ్వు...సావిత్రి అత్తయ్యను వీధిలో వదిలి పెట్టేద్దు గానిలే....' అంది. సావిత్రి కంగారుపడింది. పరుగెత్తుకుంటూ పార్వతి దగ్గరకు పోయి 'నన్నేమనక పారూ...నాకేమీ తెలియటం లేదు...అంతా అయోమయంగా వుంది' అంది. లలితమ్మ మాట్లాడలేదు. గోపాలరావు స్తంభీభూతుడైనాడు. సావిత్రి పార్వతి నానుకుని 'బిగ్గరగా మాట్లాడకూడదమ్మా' అంది. 'నాకు తెలుసులే' అన్నట్లు పార్వతి పెదవి విరిచి కళ్లు మూసుకుంది.

గోడగడియారం గంటలుకొట్టలేక కొట్టలేక విషాదంగా మూలిగింది. దానితాలూకు చప్పుడు గంటలు ఆగిపోయిన తర్వాత కొద్దిసేపటిదాకా గదిఅంతా మూగధ్వనినిచ్చింది. పార్వతి కళ్లు తుడుచుకుని "అమ్మా రామాపురం తప్పకుండా పోవలసిందేనా?" అంది. లలితమ్మ అక్కడలేదు—అప్పటిదాకా యింట్లో జరిగిన సంగతు లేవీ పార్వతికి తెలియవు. ఆ పదినిమిషాల నిద్రలోనూ ఆమె కలలో చనిపోయిన భర్త నీడగా వచ్చి "నన్ను వకసారివచ్చి చూసిపోవూ" అంటూ ప్రాధేయపడ్డట్లు కనిపించింది. అతనివంక చూసి ముఖం ముడుచుకుంది గాని అతను ప్రాధేయపడటంచూసేటప్పటికి ఆమెగుండె నీరయింది.

"సుస్థీ నయమయి బాగుపడతా నని అనుకున్నా గాని యిట్లా అర్థాంతరంగా కథ ఆగిపోతుం దనుకో లేదు పార్వతీ...అటువంటి సంశయం లేశమాత్రంగా నయినా వుండివున్నట్లయితే...నీ జీవితంలో తెలిసి నిప్పులు పోస్తానా పార్వతీ...నన్ను నమ్మవూ" అతను యింకా ప్రాధేయపడుతున్నట్లు పార్వతి కళ్లముందర కనపడుతోంది.

"పార్వతీ...నువ్వు అన్యథా భావించకపోయినట్లయితే నా ఆత్మశాంతికోసం వక్క పని చెయ్యవూ. నేను ఎప్పటికీ నీకు కృతజ్ఞుడనై వుంటాను...నాశాంతి కోసం పారూ....అదీ స్వార్థమేఅనుకో....నువ్వుమళ్ళీ పెళ్లి..."

పార్వతి కళ్లవెంబడి నీరు జాలువారుతున్నాయి. మళ్లీ పెళ్లిమాట తలపుకు వచ్చేటప్పటికి కళ్ళు బాగా గట్టిగా నులుముకుని చేతులు కళ్లముందర వూపింది ఆ నీడను వదిలించుకోవటానికి. ఆమెభర్త నీడ, వచ్చినట్లుగానే గాలిలో కలిసిపోయింది.

"ఏమిటి పారూ...యిందాకటినుంచీ కలవరిస్తున్నావు..." లలితమ్మ పార్వతి దగ్గరకు వచ్చి బుజ్జగిం

పుగా అడిగింది. వాకిట్లో ఒంటెద్దుబండి చేస్తున్న గజ్జెల గలగల పార్వతికి కాలయముని గజ్జెల ఘుంఘుణాలా వినిపించింది.

"అక్కడికి వెళ్ళక తప్పదా అమ్మా..."

గోపాలరావు బండీలో పెట్టె పెట్టివచ్చి చేతులు దులుపుకుంటూ.

"ఇంకా ఏమిటి అక్కయ్యా ఆలస్యం...బండికి టైమయి పోతుంటేను..." హడావుడిగా అన్నాడు. పార్వతి లేచి మెల్లిగా అడుగులు వేసుకుంటూ బయటికి వచ్చింది. లలితమ్మ భుజంమీద చెయ్యి వేసుకుని.

బండి స్టేషనుకు చేరేటప్పటికి రైలు రానే వచ్చింది. బండిమనిషి ఎద్దు మెడతాడు బండిచక్రానికి కట్టేశాడు. బండి అటూ యిటూ కదలకుండా వుండటానికి. గోపాలరావు జనసమూహంలోనుంచి తోసుకుంటూ పెట్టెను ప్లాటుఫారం మీదికి చేరవేశాడు. బండిమనిషి గోపాలరావు చేతిలో పెట్టెని కిందకు అందుకుంటూ:

'మీరు పోయి టిక్కెట్లు నూక్కరండి... నేను పెట్టెలట్టుకొస్తాగందా' అన్నాడు. పార్వతి బండీ దిగి పెద్ద పెద్ద అంగలు వేస్తూ గోపాలరావు దగ్గరకు వచ్చి:

'నాకు సెకండు క్లాసు టికెట్టు తీసుకో మామయ్యా...మూడో క్లాసులో నేను కూర్చోలేను' అంది. గోపాలరావు మారుమాట్లాడకుండా బుకింగ్ ఆఫీసుకు బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

పార్వతిని సెకండుక్లాసు కంపార్టుమెంటులో ఎక్కించి బండీకి టయం అయిపోవటంవల్ల 'అమ్మా వాళ్ల దగ్గరకు పోతాను పారూ. బండి టయం అయింది మరి...మళ్ళీ పై స్టేషనులోవచ్చి కలుసుకుంటానులే.' అన్నాడు. ఆమె చింపిరి జుట్టు, కుంకుమ లేక వెల వెల బోతున్న ఆమె ముఖం, బోసిపోయిన ఆమె చేతులూ అతన్ని వెక్కిరిస్తున్నాయి. ముఖం వెనక్కు తిప్పేసుకుని ఆర్ద్రమైన స్వరంతో 'పోతున్నా పారూ' అన్నాడు. పార్వతి అతని మాట వినిపించుకోకుండానే ఢభీలున తలుపు వేసి లోపలకు వెళ్లిపోయింది.

బండి బయలు దేరినప్పటినుంచీ లలితమ్మా సావిత్రీ అదే పనిగా మాట్లాడటం మొదలు పెట్టారు. రామాపురంలో చూడబోయే పరిస్థితులు, జరుగుతున్న పరిస్థితులు పార్వతి భావి జీవితం మొదలైనవి చర్చలోనికి వస్తున్నాయి. సావిత్రి మటుకు లలితమ్మ ఏ మాటన్నా ఊ కొట్టి వూరుకొంటోంది. గోపాలరావు రెట్టిస్తున్నాడు ప్రతిమాటకీ. ఆ పెట్టెలోనే యిద్దరు ముగ్గురు ముసుగులు పెట్టి పడుకున్నారు. ఆడవాళ్ళో మొగవాళ్లో గూడా తెలియటంలేదు. మధ్య మధ్య ముసుగులోనుంచే అటూ యిటూ మసులుతున్నారు. మధ్య మధ్య కలవరిస్తున్నారు గూడా. ఆ ముసుగులను చూస్తుంటే అంతకుముందు జరిగిన ఏదో విషాద సంఘటన ఛాయామాత్రంగా స్ఫురిస్తోంది. లలితమ్మకు నిద్రఉండుండి మగతగా వస్తోంది. సావిత్రి ప్రక్కకు జరిగి లలితమ్మ నిద్రపోవటానికి చోటిచ్చింది. లలితమ్మ జారి పడబోయి వులిక్కిపడి లేచింది.

"ఏరా గోపాలం...పార్వతి నొకసారి చూసి రారా...ఎట్లా వుందో ఏమిటో...ఎంత వద్దన్నా దాని మొండిపట్టేగాని వక్కతే అక్కడా...నలుగురికీ ఆ క్లాసే కొనరా అంటే డబ్బు లేదో అని నీ గొడవ...ఛీ...సరే నామాటలకేం గాని వకసారి చూసిరారా" లలితమ్మ దవడలు నొక్కుకుంటూ నాలుగు పక్కలా పరికించింది. అంతా మగత నిద్రలో వున్నారు. బయటినుంచి చలిగాలి రివ్వుమంటూ వస్తోంది. మధ్య మధ్య మిణుగురు పురుగులు గాలికి ఎగిరిపడి వస్తున్నాయి లోపలకు. రైలు వేగంతోపాటు హెచ్చుతూ తగ్గుతోంది లోపలి ఎలెక్ట్రిక్ దీపం.

"స్టేషను వస్తున్నట్టుందే...యిక్కడ దిగి చూసి రారా...వీలయితే అక్కడే కాసేపుండి...ఏమైనా మంచిమాటలు నాలుగు చెప్పిరా..." అంది.

"ఇది అప్పుడే మనవూరినుంచి నాలుగో స్టేషను. ఇప్పుడే స్టేషను వచ్చినట్లు మాట్లాడుతున్నావు... చూసివస్తాలే...'' అన్నాడు గోపాలరావు కూర్చున్న చోటినుంచి లేచి వాకిలివైపు పోతూ.

"నాలుగు స్టేషన్లువస్తే యిందాకటినుంచీ ఏం చేస్తున్నావురా" అంది లలితమ్మ విసుగ్గా మెటికలు విరుస్తూ.

బండి కూతకూస్తూ వేగం తగ్గించి మెల్లిగా పోతోంది. చూస్తుండగానే సిగ్నలు దాటిపోయి స్టేషనుగూడా వచ్చేసింది. తన పెట్టెలోకి ఎక్కటానికి వచ్చేవాళ్ళను తోసుకుంటూ కిందకు దిగి. పార్వతివున్న పెట్టెదగ్గరకు మెల్లిగా అడుగులు వేసుకుంటూ వెళ్లాడు. తలుపులోపల వేసివుంది. బయటనుంచి తీయటానికి సర్వవిధాలా ప్రయత్నం చేశాడు. తలుపును నాలుగైదుసార్లు కొట్టిచూశాడు. అప్పటికీ తలుపు రాకపోయే టప్పటికి గాబరాపడుతూ పోర్టరును పిలుచుకు రావటానికి పరెగత్తాడు. ప్లాటుఫారం ఆ మూలనుంచి ఈ మూలదాకా రెండు సార్లుతిరిగినా

ఒక్కడూ కనపడలేదు. టిక్కెట్టు కలెక్టరుతో చెపితే పని వుందంటూ హోటలు లోకి చొరబడ్డాడు. గోపాలరావు అయోమయంలో పడ్డాడు. ఏం చెయ్యటానికి తోచక బండి బయలు దేరేటట్లుగా వుండే టప్పటికి పార్వతివున్న పెట్టి వాకిలి దగ్గరకు పరుగెత్తాడు. ఫుట్ బోర్డుమీద నిలబడి కడ్డీ బట్టుకున్నాడు. బండీ బయలుదేరింది.

బండీ ప్లాటుఫారం దాటగానే తలుపు దానంతట అదే తెరుచుకుంది. 'అమ్మయ్యా' అనుకుంటూ బండీలోపల అడుగు పెట్టి తలుపును పూర్తిగా తోసేసి లోపలకు వెళ్ళాడు. గప్పుమని అత్తరువాసన ముఖానికి కొట్టేసింది. నిర్ఘాంతపోయాడు తను పొరపాటున తప్పు పెట్టెను ఎక్కాడేమోనని. వాకిలినుంచి తల బయటకు పోనిచ్చి పెట్టె నెంబరు చూశాడు. తను గుర్తు పెట్టుకున్నదే. సంశయంతో బెరుకుగా అడుగులు వేస్తూ లోపలకు వచ్చాడు.

'ఏం మామయ్యా....అట్లా కంగారు పడుతున్నావు' పార్వతి నింపాదిగా సోఫాలో పడుకుని అడిగింది. గోపాలరావు కళ్లు తిరిగిపోయినాయి. ఎర్రటి తిలకం నుదుట ఎలెక్ట్రిక్ బల్బు కాంతిలో మిలమిలలాడుతోంది. మల్లెపూలు సోఫానిండా విరజిమ్మబడి వున్నాయి. పెద్ద మల్లెపూల చెండు చుట్ట చుట్టుకుని పార్వతి కొప్పులో కూర్చునివుంది. ఆ పూలన్నీ గాత్రం విప్పి గానం చేస్తున్నట్లు కనపడుతున్నాయి గోపాలరావుకు. ఘుమఘుమలాడుతున్న ఆ పెట్టె... ఆ వాతావరణం... పెట్టె తలుపులన్నీ మూయబడి వుండటంవలన పెట్టెలో గాలికి రాకపోకలు లేక నులివెచ్చగా ఉంది. స్విచ్ బోర్డులో అగరువత్తుల కట్ట వకటి నిలువునా కాలిపోతోంది.

పార్వతి చిరునవ్వునవ్వుతూ "ఏంమామయ్యా .. బావుందా" అంది. ఆమె ముఖం విప్పారింది. ఆమె తలలోని పూలన్నీ కిలకిలా నవ్వుతున్నాయి. గోపాలరావు కళ్లు నులుముకున్నాడు. పార్వతికి తెలియకుండానే ఎడంకాలిని కుడికాలి గోరుతో గీరుకుని చూశాడు, అతను చూస్తున్నది కలా...నిజమా అనే సంశయంతో.

"పారూ....యిదంతా ఏమిటి...." అన్నాడు అమితాశ్చర్య పడుతూ.

"కూర్చో మామయ్యా.... చెపుతానుగా.." అంది పార్వతి. ఆమె ముఖం యింకా నవ్వుతునే వున్నది.

"నేను మళ్ళీ పెళ్లి చేసుకుంటానుమామయ్యా... ఈసారి మంచి సంబంధం చూసి పెడతావుగదూ."

గోపాలరావుకు పిచ్చెత్తి నట్లయింది. పార్వతికి పిచ్చెత్తిందేమోనని భయపడ్డాడు.

"పార్వతీ!" అంటూ బిగ్గరగా అరిచి గొలుసు లాగటానికి లేచాడు దానివంక చూస్తూ. పార్వతి గభాలున అతని చెయ్యి పట్టుకుని "కూర్చో మామయ్యా...తొందరపడకూ..." అంది ప్రతీ అక్షరాన్నీ సాగదీస్తూ. గోపాలరావు మాట్లాడకుండా సోఫాలో కూలపడ్డాడు.

"నేను పెళ్లి చేసుకుని సుఖపడటం యిష్టంలేదా మామయ్యా"

"పార్వతీ...వక్క గంటలో యిలా మారి పోయా వేమిటి..."

"నిజం చెప్పు మామయ్యా ... గుండెల మీద చెయ్యివేసుకుని చెప్పు...నా సుఖం నువ్వు కోరటం లేదా...?"

"మళ్ళీ పెళ్లా...మన శాస్త్రాలు ఎలా వొప్పుకుంటాయి" గోపాలరావు మూర్ఖంగా వెలుగుతున్న బల్బువంక చూస్తూ అన్నాడు. పార్వతి అతని చేయి పట్టుకుని "మన శాస్త్రాలన్నీ మనం రాసుకున్నవేగా మామయ్యా...మనల్ని బాధపెట్టేవి మన కెందుకు?" అంది. గోపాలరావు ఆలోచనలో పడ్డాడు. అతని ఆలోచనలో స్మృతులూ, శ్రుతులూ వరుసాగ్గా నీడల్లాగా కనబడుతున్నాయి.

"వీల్లేదు పారూ...మళ్లీ పెళ్లి వీల్లేదు...మన మతం హర్షించదు...మన పెద్దలు వప్పుకోరు...వీల్లేదు పారూ...నన్నిలాంటి ప్రశ్నలు మళ్లీ అడగవద్దు..." అన్నాడు. పార్వతి సంచీలోనుంచి అద్దంతీసి ముఖం చూసుకుని కుంకుమ సర్దుకుంది సగర్వంగా చూసుకుంటూ.

"ఈ సామానంతా ఎక్కడిది పారూ" వెలుగుతున్న అగరువత్తుల కట్టవంక చూస్తూ అడిగాడు.

"ఈ పెట్టెలో నేనెక్కినతర్వాత చాలా స్టేషనులు వచ్చాయి మామయ్యా..."

గోపాలరావు మౌనం దాల్చాడు. అటూ ఇటూ చూస్తూ ఆ పూలవాసన దొంగతనంగా ఆఘ్రాణిస్తున్నాడు. అగరువత్తుల మీదనుంచి వస్తున్న సువాసన మత్తును కలిగిస్తోంది.

పార్వతి గోపాలరావుకు యింకా దగ్గరగా జరిగి 'మామయ్యా' అంది. ఆమె గాత్రంలోని తొట్రుపాటు గోపాలరావు గ్రహించక పోలేదు. అతనికేదో మైకం కమ్మినట్లయింది. పిచ్చిగా ఆమెవంక చూస్తూ

‘యిదంతా ఏమిటి పారూ...నన్నిట్లా ఎందుకు హింసిస్తావు’ అన్నాడు. ఆమె అతని చేతులను మృదువుగా తాకుతూ.

‘ఏం మామయ్యా...నాశనమయిన నా జీవితంలో వక్క మధుర రాత్రాన్ని కూడా సహించలేక పోతున్నావా...బీటు వారిన నా హృదయ క్షేత్రంలో వక్క మల్లె మొక్క నాటటానికి వెనుకాడుతున్నావా...నాకు మనశ్శాంతి కావాలి మామయ్యా...ఈ వక్క రాత్రీ నా జీవితంలో వసంతంగా వెళ్లి పోనియ్యవూ...నీ కెప్పటికీ కృతజ్ఞురాలినిగా వుంటాను.’ పార్వతి చెప్పిన మాటలన్నీ విని గోపాలరావు వక్కసారిగా లేచి నిలబడ్డాడు.

‘ఇప్పుడే వెళ్ళిపోతా...నన్ను వదిలి వెయ్యి...నన్నిలా బ్రతకనీ’ అంటూ బిగ్గరగా అరిచాడు. పార్వతి లేచి అతని చెయ్యి గట్టిగా పట్టుకుంది.

‘బాగా ఆలోచించుకో...నా మాట మన్నించలేక పోయినట్లయితే...నీ మీద....అపనింద వేసి నీ జీవితాన్ని నాశనం చెయ్యటానికయినా వెనుదీయను .. అపనింద...మొగుడు చచ్చిన ఆడదాన్ని...నీ జీవితం నాశనం చేసికోకు మామయ్యా....నా జీవితం శాంతంగా వెళ్ళనీ....చెయ్యిలో చెయ్యి వేసి చెపుతున్నాను...నామాట మన్నించవూ...” పార్వతి గాత్రం గీరపోయింది. గోపాలరావు చలించిపోయాడు. పార్వతి కళ్లనీళ్ళు తుడుచుకుంటూ “మా....మ....య్యా’ అంది గంభీరంగా, గోపాలరావు ఆమెను వక్కసారిగా హృదయానికి హత్తుకుని ‘పారూ’ అన్నాడు. ఆ పెట్టెలో దీపం ఆ క్షణమే ఆరిపోయింది. పార్వతే లైటు తీసివేసిందని గోపాలరావుకు తెలియదు...

లైటు వెలిగేటప్పటికి గోపాలరావు బద్ధకంగా ఆవలిస్తూ సోఫామీదనుంచి లేచాడు. పార్వతి పంపుదగ్గరకు పోయి ముఖం కడుక్కుని వచ్చింది. కుంకుమ చెరిగిపోయిన నీళ్ళు ఆమె చెక్కిలిపక్కగా జారి ఎర్రటిగీతలా కనపడుతోంది. తలలో నలిగిపోయిన పూలనన్నిటినీ వుండమట్టి కిటికీలోనుంచి బయటకు పారేసింది. వెలుగుతున్న అగరువత్తుల గుత్తిని ఆపాటున కిటికీలోనుంచి విసిరిపారేసింది. అత్తరు తడిపిన జేబురుమాలును సునాయాసంగా కిటికీలోనుంచి వదిలిపెట్టింది. గోపాలరావు నిశ్చేష్టుడై “ఉండనీ పారేద్దువు గానిలే” అన్నాడు. పార్వతి అతనివంక కఠినంగా చూస్తూ:

“ఇంకా ఎందుకు...వీటిపని అయిపోయింది” అంది. ఇంతవరకూ సుకుమారంగా మాట్లాడిన గొంతు అంత కర్కశంగా మారేటప్పటికి గోపాలరావు తలక్రిందు లయిపోయాడు.

“ఇప్పటికయినా అర్థమయిందా”—పార్వతి అతనివంక చూస్తూ పకాలున నవ్వింది. అతనికి నవ్వాలో ఏమిచెయ్యాలో తెలియలేదు. ముఖం గంభీరంగా పెట్టి:

“ఏమిటి” అన్నాడు. పార్వతి విరగబడి మళ్లీ నవ్వుతూ ఒక్కసారిగా ఆగ్రహం తెచ్చుకుంది.

“నాజీవితం సర్వవిధాలా నాశనం చేసినందుకు...నీ జీవితాన్ని కూడా నాశనం చెయ్యగలిగాను మామయ్యా...నాకు అదే తృప్తి...మొగుడు చచ్చిన ఆడదాన్ని” ఆమాట అంటూనే పార్వతి బిగ్గరగా పిచ్చిదానిలా నవ్వింది.

“ఆ పాపం నిన్ను వదిలి పెట్టదులే మామయ్యా...నీజీవితాంతంవరకూ నిన్ను వెంటాడుతూనే వుంటుంది. నీకు యిక్కడే కాకుండా స్వర్గంలో కూడా స్థానం లేకుండా చేశాను...మొగుడు చచ్చిన...నాకేం...నేను సూటిగా స్వర్గానికే పోతాను...స్వర్గం అంటూ వకటి వుండేటట్లయితే... నే నేం పాపం చెయ్యలేదు.. నాకు వక్కడే భర్త...ఈ రోజే నా జీవిత వసంతం...ఆ చచ్చినవాడిని నేను కోరి చేసుకోలేదు...ఆస్థికోసం...పరపతి కోసం ఆశించి...మీరు చేసుకున్నారు ఆ పెళ్లి. దానితో నాకేం సంబంధం...నువ్వో కట్టుకున్న పెళ్లాన్ని వదిలి మొగుడుచచ్చిన...ఆ పాపం నిన్ను వదలదులే మామయ్యా...” పార్వతి గంభీరం వదిలి తిరిగి బిగ్గరగా నవ్వుతోంది. గోపాలరావు కంగారు పడిపోయాడు.

“అపనింద వెయ్యనని హామీ నిచ్చావుగా రాక్షసీ...మళ్ళీ బిగ్గరగా అరిచావంటే” గోపాలరావు పెద్దపులిలాగా మీదకు వురికాడు ఆమె గొంతును గట్టిగా పట్టుకుంటూ.

‘తొందరపడకు మామయ్యా...నన్ను హత్య చేసినా దాగదులే...ఇప్పుడు జరిగిందంతా జరుగుతుందని ముందుగానే తెలుసు నాకు... నేను చెపుతున్నాగా నాకు తెలుసు...అందుకనే రాశాను వక తెల్ల కాగితంమీద ... నా చరిత్రంతా రాశాను...తొందరపడకు..నీ చరిత్రకూడా రాశానులే దాంట్లో.. అది నలుగురికీ తెలియదూ...నవ్వరూ నలుగురూ.... ఊఁ...ఏం మామయ్యా అట్లా చూస్తున్నావు’ గోపాలరావు ఆమెను సోఫామీదకు ఒక్క తోపుతోసి.

‘ఆ కాగితం ఎక్కడ...ఎక్కడ దాచావు...’ అంటూ అరవడం మొదలుపెట్టాడు. పెట్టె అంతా, సంచీలోనూ, పరుపుకిందా వెదికాడు గాబరా పడుతూ.

‘ఏం మామయ్యా...నీకు కనపడేచోట దాచి పెట్టాననుకున్నావు గదూ... అంత తెలివితక్కువ దాన్ని గాదులే.... తెలివి రానపుడు చేసిన అన్యాయానికి తెలివి వచ్చిన తర్వాత ప్రతీకారం తీర్చుకున్నాను...అయినా కాగితంమీద కాదులే రాసింది.. ఒక నల్లరాతిమీద రాశాను....చెరుపుదామంటే చెరగదులే...అది కఠినశిలగదూ మామయ్యా...అందుకని ‘కఠిన శిల’ అంటుంటే ఆమె గాత్రం గరగరలాడింది. ఆమె నేత్రాలు అశ్రుపూరితాలయిపోయినాయి

“రాక్షసీ...నిన్నేం చేస్తానో చూడు...అది దొరక్కపోతే పోయిందిలే” కాగితం దొరకని ఆవేశంలో ఆమెను గట్టిగా ఒకచేత్తో దగ్గరకు లాక్కుని రెండు చేతులతో గొంతు పట్టుకోబోయాడు.

“వృథా శ్రమపడక మామయ్యా...నాకీ సంగతీ తెలుసు...అందుకనే నీకు శ్రమలేకుండా నేనే పోదామనుకున్నాను...ఇదుగో ఈ సీసా చూడు... తాగేశానులే ... పాయిజన్ ... అంటే తెలుసు అనుకుంటా...నీ కెందుకు శ్రమ... దానంతట అదే పోతుందిలే ప్రాణం...” గోపాలరావు సందిగ్ధావస్థలో పడ్డాడు. విషంతాగి మరణావస్థలోవున్న మనిషితో ఎట్లా వేగాలో తెలియటంలేదు. పార్వతి తూలుపాటువచ్చి సోఫామీద విరుచుకు పడిపోయింది. రైలు ధనధనామని చప్పుడుచేస్తూ నిర్లిప్తంగా పోతునే వుంది.

“పార్వతీ ... పారూ ... ఆ కాగితం ఎక్కడ పెట్టావో చెప్పవూ...నీకేం కావాలంటే అది చేస్తాను” గోపాలరావు ఆమె గడ్డం పట్టుకు బ్రతిమిలాడుతున్నాడు.

“నాకేం చేస్తావు మామయ్యా...వెళ్ళిపోతున్న దానికి...కాగితం ఎక్కడపెట్టావో చెబితే చించి వేద్దామనిగదూ...ఆ...కాగితం మీద కాదని చెప్పానుగా రాసింది...నల్లరాతిమీద రాశాననిగూడా చెప్పానుగా...అదిగూడా చెప్పమంటావా”

“పార్వతీ ... నాకేం అర్థంకావటంలేదు ... నన్ను క్షమించలేవా ... ఎక్కడా నువ్వు రాసింది చెప్పవా పారూ...”

‘క్షమించలేను మామయ్యా...నా పేరు పదే పదే ఉచ్చరించి కలుషితం చెయ్యకు...అయినా చెబుతానులే...చూసుకో...నీ రాతి గుండెమీద రాశాలు...చేతనయితే హృదయం చీల్చుకుని చెరిపివేసుకో...’ పార్వతి ఆయాసపడుతూ ముఖం పక్కకు తిప్పుకుంది. ఆమె ముఖం రంగు మారిపోయింది. నల్లబారుతోంది. గోపాలరావు బరువుగా నిట్టూర్చాడు. పార్వతి గిలగిలా తన్నుకోవటం మొదలుపెట్టింది. అతను కంగారు పడుతూ గొలుసు లాగుదామని దానిని చేతిలో పట్టుకోగానే బండి దానంతట అదే ఆగిపోయింది.

బయటినుంచి కిళ్ళీ, టీ వాళ్ళు పూరికే అరుస్తున్నారు. గోపాలరావు గబగబా కిందకుదిగి స్టేషను మాష్టరు దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళి ఆయన్ని పిలుచుకు వచ్చాడు. ఆయన వచ్చేటప్పుడు ఫస్టుయైడ్ బాక్సు పట్టుకువచ్చాడు. ఇద్దరు పోర్టర్లు గబగబా పెట్టెలోకి ఎక్కి పార్వతిని బలవంతంగా దించారు. కింద అప్పటికే జనం రద్దీ ఎక్కువయింది. చుట్టూరా మూగి హడావుడి చేస్తున్నారు. లలితమ్మా, సావిత్రీ గూడా సామాన్లు దింపుకువచ్చారు వీరున్న చోటికి. ఆ స్టేషను రామాపురం అని తెలుసుకున్నాక. జనంలోనుంచి చొచ్చుకుని పార్వతి దగ్గరకు చేరటం ప్రళయం అయిపోయింది.

పార్వతి మూలుగు ఎక్కువైంది. ఆ ధ్వని ఎక్కడో పాతాళంనుంచి వస్తున్నట్లుంది. రెండు మూడుసార్లు బలవంతాన పెదవులు కదల్చటానికి ప్రయత్నం చేసింది. ఆ వచ్చినాయన ఏదో సీసాలో నుంచి మందు చెంచాతో తీసి పెదవులు తడిపాడు. పార్వతి పెదవులు బలవంతాన కదుపుతూ ‘విషం... నేనే...చచ్చి...ఊ...పు చ్చు కు న్నా ను’ అంది. గోపాలరావు స్టేషనుమాష్టరుగారి భుజం పట్టుకుని:

‘వినండి డాక్టరుగారూ...నాకేం తెలియదు... నేనేం చెయ్యలేదు’ అన్నాడు. పార్వతి ముఖంలో రేఖామాత్రంగా చిరునవ్వు పొడసూపింది గోపాలరావు వంక చూస్తూ. లలితమ్మా సావిత్రీ, పార్వతి దగ్గరకు చేరి హోరుహోరున ఏడుపు ప్రారంభించారు. రైలు స్టేషను మీదుగా రాలిపోయిన నక్షత్రం గోపాలం దృష్టిలో పడింది. అతని హృదయం జల్లుమంది. వక్కసారిగా వణికిపోతూ అతని రెండు చేతులూ హృదయానికి హత్తుకున్నాడు. అతని చేతికేమిటో అక్షరాల్లాగా గుచ్చుకున్నాయి.